
ప్రజాశక్తి
శనివారం 16 నవంబర్ 2024
5
పార్వతీపురం మన్యం



చైర్‌పర్సన్ పదవికి రాజీనామా

ప్రజాశక్తి - పాలకొండ

స్థానిక నగర పంచాయతీ చైర్‌పర్సన్ యందవ రాధాకుమారి తన పదవితో పాటు 19వ వార్డు సభ్యత్వానికి శుక్రవారం రాజీనామా చేశారు. ఆమె భర్త అకాల మరణంతో కారుణ్య నియామకంలో ఆమె ఉద్యోగం పొందే క్రమంలో ఈ రాజీనామా చేశారు. రాజీనామా పత్రాన్ని వైసిపి కౌన్సిలర్ల సమక్షంలో కమిషనర్ ఎస్.సర్వేశ్వరరావుకు అందజేశారు. ఈ సందర్భంగా రాధాకుమారి మాట్లాడుతూ తనకు పదవి కట్టబెట్టిన ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్‌కు, మాజీ ఎమ్మెల్యే వి.కళావతికి కృతజ్ఞతలు తెలిపారు. తన భర్త మరణంతో తీవ్ర మనస్తాపానికి గురయ్యానని, పిల్లల భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకొని ఉద్యోగంలో చేరేందుకు తన పదవికి రాజీనామా చేస్తున్నానని తెలిపారు.

'పల్లె పండగ'కు రాజకీయ గ్రహణం

- డిసెంబర్‌కు పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశం
- తీర్మానాలు ఇవ్వని వైసిపి సర్పంచులు
- అడకత్తెరలో పోక చెక్కల్లా పిఆర్ ఇంజనీర్లు

ప్రజాశక్తి - పార్వతీపురం

ఉపాధి హామీ చట్టం కింద జిల్లాలో చేపట్టనున్న పల్లె పండుగ పనులకు రాజకీయ గ్రహణం పట్టింది. జిల్లాలో మెజారిటీ పంచాయతీలు వైసిపి అధీనంలో ఉన్నాయి. పంచాయితీల తీర్మానం లేనిదే ఉపాధి పనులు ప్రారంభించే అవకాశం లేదు. ఈ ఏడాది ఆగస్టు 23న రాష్ట్ర వ్యాప్తంగా అన్ని గ్రామపంచాయతీల్లో గ్రామసభలు నిర్వహించి ప్రతిపాదించిన పనులకు ఆమోదం తెలిపారు. ఈ పనులను పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా ఒకేసారి ప్రారంభించాలని పంచాయతీరాజ్ శాఖ మంత్రి పవన్ కళ్యాణ్ చెప్పారు. ఈ మేరకు కొన్ని గ్రామాల్లో పల్లె పండుగ పనులు ప్రారంభించారు. బిటి, సిసి రోడ్లు, కాలువలు, వంతెనలు, కల్వర్టుల నిర్మాణ పనులు చేపట్టనున్నారు. ఉపాధి హామీ పథకం కింద 60శాతం లేబర్ కాంపొనెట్, 40 మెటీరియల్ కాంపొనెంట్‌తో పనులు చేపడతారు. జిల్లాలో పంచాయతీ రాజ్ ఇంజనీరింగ్ ద్వారా 505 పనులకు గానూ 304 పనులు ప్రారంభమయ్యాయి. ఇంకా 201 పనులు ప్రారంభం కాలేదు. పల్లె పండుగ ప్రారంభించి నెల రోజులు కావస్తున్నా ఇంతవరకు ప్రారంభం కాకపోవడానికి కారణం గ్రామపంచాయతీల తీర్మానం లేకపోవడమేనని తెలుస్తోంది. వైసిపి సర్పంచుల నాయకత్వంతో ఉన్న పంచాయతీల తీర్మానాలు ఇచ్చిన చోట్ల పనులు ప్రారంభమయ్యాయి. పంచాయితీల తీర్మానాలు లేని గ్రామాల్లో పనులు ముందుకు సాగడం లేదు. జిల్లాలో సాలూరు, పాచిపెంట, జియ్యమ్మవలస, గుమ్మలక్ష్మీపురం మండలాల్లో ఎక్కువగా పనులు ప్రారంభం కాకపోవడంతో జిల్లా కలెక్టర్ శ్యాం ప్రసాద్ మంగళవారం నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆగ్రహం వ్యక్తం చేశారు. పిఆర్ ఎఇలు, డిఇలపై కలెక్టర్ అసహనం వ్యక్తం చేశారు. వారంరోజుల్లో పనులు ప్రారంభించి డిసెంబర్ నెలాఖరుకు పూర్తి చేయాలని ఆదేశించారు. పనులు ప్రారంభించకపోతే ఇంజనీరింగ్ అధికారులదే బాధ్యతని హెచ్చరించారు. దీంతో పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారుల పరిస్థితి అడకత్తెరలో పోకచెక్కలా తయారైంది. పంచాయితీ తీర్మానాలు కావాలని అధికారులు స్థానిక సర్పంచులను అడిగినా ఇచ్చే పరిస్థితి కనిపించడం లేదు. పంచాయితీ పరిధిలో జరగనున్న పనుల్లో కొన్ని తమకు ఇస్తే తీర్మానాలు ఇవ్వడానికి సర్పంచులు అంగీకరిస్తున్నారు. సర్పంచులు, స్థానిక టిడిపి నాయకులు అవగాహనతో ఉన్న గ్రామాల్లో పనులు ముందుకు వెళ్తున్నాయి. నువ్వా నేనా అన్న రీతిలో ఉన్న పంచాయతీల్లో పనులు ప్రారంభానికి నోచుకోలేదు. మరోవైపు పాచిపెంట మండలానికి చెందిన కొంతమంది వైసిపి సర్పంచులు పంచాయతీ తీర్మానాలు లేకుండా ఉపాధి పనులు చేపట్టడంపై హైకోర్టులో పిటిషన్ వేసినట్లు తెలుస్తోంది. ఉపాధి చట్టంలో ఉన్న నిబంధనల ప్రకారం పనులు జరగాలని వారు డిమాండ్ చేస్తున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో పల్లె పండుగ పనులు పూర్తి చేయాలని కిందిస్థాయి ఇంజనీరింగ్ అధికారులపై ఒత్తిడి పెంచడం చర్చనీయాంశమవుతోంది.



ఏజెన్సీలో పల్లెపండగ రోడ్డుకు శంకుస్థాపన చేసిన నాయకులు (ఫైల్)

మహాసభకు వేళాయె

- నేడు, రేపు సిపిఎం విజయనగరం జిల్లా మహాసభ
- ఎస్‌బిఐ మెయిన్ బ్రాంచి నుంచి కోట వరకు భారీ ర్యాలీ, అనంతరం బహిరంగ సభ
- హాజరు కానున్న పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వైవి, లోకనాథం
- ముస్తాబవుతున్న వెంకట్ సత్య కల్యాణ మండపం
- సీతారాం ఏచూరి నగర్, బుద్ధదేవ్, ఆర్‌ఎస్ ప్రాంగణంగా నామకరణం
- సిపిఎం కార్యకర్తల్లో నూతనోత్తేజం



కోట కూడలిలో తోరణాలు కడుతున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

కమ్యూనిస్టులు, సిపిఎం అభిమానులు, సానుభూతిపరులు, పేదలు, కర్షకులు, కార్మికులు, చిరుద్యోగులు ఎప్పుడెప్పుడా అని ఎదురు చూస్తున్న సిపిఎం విజయనగరం జిల్లా మహాసభలకు వేళైంది. శని, ఆదివారాల్లో 10వ జిల్లా మహాసభలు విజయనగరంలో జరుగనున్నాయి. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లు పూర్తయ్యాయి. పండగ వాతావరణంలో మహాసభలు నిర్వహించుకునేందుకు పార్టీ కేడర్ సమాయత్తమైంది. సభా ప్రాంగణం ఎర్ర జెండాలతో రెపరెపలాడుతోంది. బహిరంగ సభ జరిగే కోట ప్రాంతంలో కూడా ఎర్రతోరణాలతో అలంకరించారు. మహాసభకు విజయనగరం నుంచి గంట్యాడ వెళ్లే రోడ్డులో అయ్యన్నపేట వినాయనగర్‌లోని వెంకట్ సత్య కల్యాణ మండపం వేదిక కానుంది. దీనికి కీర్తిశేషులు, సిపిఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి నగర్‌గాను, బుద్ధదేవ్ బట్టాచార్య, రుద్రరాజు సత్యనారాయణ రాజు ప్రాంగణాలుగా నామకరణం చేశారు. విజయనగరంలోని ఎస్‌బిఐ మెయిన్ బ్రాంచి నుంచి ఉదయం 10గంటలకు నుంచి కన్యకాపరమేశ్వరి, గంటస్తంభం, మూడు లాంతర్లు మీదుగా కోట వరకు భారీ ర్యాలీ సాగనుంది. అందులో పార్టీ కేండర్‌తోపాటు అభిమానులు కూడా భాగస్వామ్యం కానున్నారు. కోట వద్ద బహిరంగ సభ జరగనుంది. అనంతరం మధ్యాహ్నం 3గంటల నుంచి వెంకట సత్య కల్యాణ మండపంలో ప్రతినిధుల సభ ప్రారంభం కానుంది. గడిచిన మూడేళ్లలో పార్టీ చేపట్టిన పోరాటాలు, అనుభవాలను సమీక్షించుకొని, పేదలు, రైతులు, దళితులు, గిరిజనులు వంటి అణగారిన తరగతులు ఎదుర్కొంటున్న ఇబ్బందు, వాటిని అధిగమించేందుకు చేపట్టాల్సిన పోరాటాలపై సమగ్రంగా చర్చించనున్నారు. పలు అంశాలపై తీర్మానాలను సభ ఆమోదానికి పెట్టనున్నారు. మొత్తం మహాసభల నిర్వహణకు సంబంధించిన ఏర్పాటు ఇప్పటికే పూర్తయ్యాయి. ఏర్పాట్లను పార్టీ జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నారు. మహాసభలకు ముఖ్య అతిథులుగా పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వై.వెంకటేశ్వరరావు, కె.లోకనాథం హాజరు కానున్నారు. మహా సభల నేపథ్యంలో పార్టీ కేడర్‌లో నూతనుత్తేజం కనిపిస్తోంది.



ఫిర్యాదులను పరిశీలిస్తున్న ఎస్‌పి మాధవరెడ్డి

సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత : ఎస్‌పి


ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

పోలీస్ సిబ్బంది తమ శాఖాపరమైన సమస్యల పరిష్కారానికి, సంక్షేమానికి ప్రాధాన్యతనిస్తామని, ఎస్‌పి ఎస్‌వి మాధవ్ రెడ్డి అన్నారు. నిత్యం ప్రజాసేవలో నిమగ్నమై ఉండే పోలీస్ సిబ్బంది తమ శాఖాపరమైన సమస్యల పరిష్కారానికి స్థానిక జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో పోలీస్ వెల్ఫేర్ డే (గ్రీవెన్స్ డే) కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లాలోని పోలీస్ సిబ్బంది పాల్గొని వారికి ఉన్న సమస్యలను ఎస్పీకి స్వయంగా విన్నవించుకున్నారు. వారి సమస్యలను విని, విన్నపాలను పరిశీలించి సత్వర పరిష్కారానికి అవకాశం ఉన్న సమస్యలను వెంటనే పరిష్కరించారు. మిగిలిన సమస్యలను త్వరలోనే పరిష్కారం చూపుతామని సిబ్బందికి భరోసా కల్పించారు. జిల్లా పోలీస్ కార్యాలయ ఫిర్యాదులపై సంబంధిత అధికారులతో ఎస్‌పి మాట్లాడి, పరిష్కారానికి అవకాశం ఉన్న సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎస్పీ సిసి సంతోష్ కుమార్ పాల్గొన్నారు.

పాల ఉత్పాదకతను 15 శాతం పెంచాలి

ప్రజాశక్తి -పార్వతీపురం

జిల్లాలో పాల ఉత్పాదకతను 15 శాతం పెంచాలని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ ఆదేశించారు. ప్రాథమిక రంగాల శాఖలతో శుక్రవారం కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉత్పాదకత పెంపునకు పశు సంవర్ధక శాఖ అధికారులు అంకితభావంతో పనిచేయాలన్నారు. అధిక పాల ఉత్పత్తికి జిల్లాకు అనువైన రకాల గోవులను ప్రోత్సహించడం వంటి ప్రక్రియ ద్వారా పాల ఉత్పాదకత అవకాశాలు పెంచాలని సూచించారు. డీ వర్మింగ్, ఇమ్యునైజేశన్ విధిగా చేయాలని ఆదేశించారు. అజోలా, నేపియర్ గ్రాస్ సమృద్ధిగా పెంచుటకు సహకరించాలని ఆయన చెప్పారు. సంతులిత ఆహారం అందించడంలో గోపాలమిత్ర క్రియాశీల పాత్ర పోషించాలని చెప్పారు. ప్రతి మండలంలో కనీసం ఐదు వందల ఎకరాల్లో పశు దాణా పెంపునకు లక్ష్యంగా ఉండాలని ఆదేశించారు. క్షేత్ర స్థాయి పశు సంవర్ధక సిబ్బంది రైతులతో మాట్లాడి వారిలో ప్రేరణ కల్పించాలని, తద్వారా నిర్దేశిత లక్ష్యాల సాధన చేయవచ్చని తెలిపారు. పెరటి కోళ్ల పెంపకం ద్వారా గుడ్లు, మాంసం ఉత్పత్తులు పెంచవచ్చని సూచించారు. వచ్చే ఏప్రిల్ నాటికి ప్రతి మండలంలో కనీసం ఒక గ్రామాన్ని పెరటి కోళ్ల పెంపకానికి మోడల్ గ్రామంగా తీర్చిదిద్దాలని ఆదేశించారు. ఒడిషాలో కళింగ బ్రౌన్ పౌల్ట్రీ మోడల్‌ను పరిశీలించాలని సూచించారు.



అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

డెయిరీ స్థాయి ప్రాజెక్ట్ కు యోచించాలి

జిల్లాలో పాల ఉత్పాదకత గణనీయంగా పెంచడంతో పాటు డెయిరీ స్థాయి ప్రాజెక్ట్‌కు రూపకల్పన చేయాలని కలెక్టర్ అన్నారు. ప్రాజెక్టుకు కార్యాచరణ ప్రణాళిక తయారు చేయాలని ఆయన ఆదేశించారు. పాల ఉత్పత్తి, పాల ఆధారిత ఉత్పత్తులు తయారు చేసి పెద్ద ఎత్తున మార్కెటింగ్ చేయడం ద్వారా రైతుల ఆదాయాలు పెరుగుతాయని అన్నారు. కొన్ని గ్రామాలు కలిపి ఒక క్లస్టర్ వలె చేయడం ద్వారా పాల సేకరణ పెద్ద ఎత్తున చేపట్టవచ్చని ఆయన సూచించారు.

డయల్ యువర్ డిఎహెచ్‌ఒ

డయల్ యువర్ డిఎహెచ్‌ఒ (జిల్లా పశుసంవర్ధక అధికారి) ప్రతి నెలా నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు. డయల్ యువర్ డిఎహెచ్‌ఒ కార్యక్రమంలో అందిన అర్జీలకు సరైన సమాచారం అందించి మార్గదర్శకత్వం వహించాలని చెప్పారు. ప్రభుత్వం అమలు చేస్తున్న అన్ని పథకాలు రైతులకు తెలియజేయాలని స్పష్టం చేశారు. సమాచారంతో కూడిన కర పత్రాలు తయారు చేసి రైతులకు అందించాలని సూచించారు. జిల్లా పశుసంవర్ధక అధికారి ఎస్.మన్మధరావు మాట్లాడుతూ జిల్లాలో మందులు నిల్వ చేసేందుకు భవనం అవసరం ఉందన్నారు. ప్రస్తుతం బొబ్బిలి నుండి మందులు తీసుకురావడం జరుగుతోందని ఆయన చెప్పారు. సమావేశంలో డిఆర్‌డిఎ, డ్వామా పీడీలు వై.సత్యంనాయుడు, కె.రామచంద్ర రావు, గొర్రెల పెంపకం విభాగం ఉప సంచాలకులు డాక్టర్ ఎన్.నారాయణరావు, జిల్లా ఉద్యాన అధికారి కెఎస్ వరప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

వాతావరణ ఆధారిత పంటల బీమాను సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి -పార్వతీపురం

వాతావరణ ఆధారిత పంటల బీమా సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ అన్నారు. ప్రాథమిక రంగాల శాఖలతో శుక్రవారం స్థానిక కలెక్టరేట్‌లో ఆయన సమీక్షించారు. వాతావరణ ఆధారిత పంటల బీమా పథకం జీడిమామిడి రైతులకు ఉపయోగపడుతుందన్నారు. ప్రీమియం చెల్లింపుల వల్ల 2024-25 రబీ సీజన్‌కు బీమా వర్తిస్తుందని చెప్పారు. జిల్లాలో ఇ - పంటలో జీడి పంటను నమోదు చేయించుకున్న రైతులంతా 2024-25 సంవత్సరం రబీ సీజన్ జీడి పంటకు బీమా ఇన్సూరెన్స్ ప్రీమియం చెల్లించేందుకు అర్హులని ఆయన పేర్కొన్నారు. దీన్ని గ్రామ వ్యవసాయ, ఉద్యాన సహాయకుల వద్ద తీసుకున్న పంట నమోదు పత్రం, ఆధార్ కార్డు కాపీ, బ్యాంకు అకౌంట్ కాపీ, 1బి/పట్టాదారు పాస్ పుస్తకం కాపీతో సహా ఇన్సూరెన్స్ ప్రీమియం ఎకరానికి రూ.1600 చొప్పున దగ్గరలో ఉన్న మీ-సేవా కేంద్రం ప్రీమియం చెల్లించాలన్నారు. సందేహాలుంటే ఫోన్ నెంబరుకు 9550044894 సంప్రదించాలని ఆయన సూచించారు. పంట బీమా పరిహారం రైతులకు వర్తించేందుకు అకాల లేదా అధిక వర్షపాతం, తెగుళ్లకు అనుకూల వాతావరణం, అధిక ఉష్ణోగ్రత పరిగణలోకి తీసుకొని ఈనెల 1 నుంచి ఏప్రిల్ 30 మధ్య కాలంలో జీడి పంటకు నష్టం వాటిల్లితే ఎకరానికి గరిష్టంగా రూ.12,800 రైతు ఖాతాలో జమ అవుతుందని తెలిపారు. పంట నష్టం లేకపోతే రైతులు చెల్లించిన ప్రీమియం సొమ్ము తిరిగి వెనక్కి ఇవ్వడం జరగదని గమనించాలని ఆయన స్పష్టం చేశారు.

గ్రంథాలయాలు విజ్ఞాన దీపికలు

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

గ్రంథాలయాలు విజ్ఞాన దీపశిఖలని జిల్లా గ్రంథాలయ సంఘం అధ్యక్షులు టి.శివ కేశవరావు అన్నారు. గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం స్థానిక వాసవి కళాశాలలో గ్రంథాలయ సంఘం వివిధ కార్యక్రమాలు నిర్వహించింది. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షులు మాట్లాడుతూ గ్రంథాలయాలను సమర్ధవంతంగా ఉపయోగించుకోవడం ద్వారా గొప్ప విజ్ఞానాన్ని సమకూర్చుకోవచ్చని అన్నారు. కాలేజీ ప్రిన్సిపల్ ఎంవిఎస్ శర్మ మాట్లాడుతూ గ్రంథాలయాల్లో చదివి ఉన్నత చదువులు, పదవులు పొందినవారు అనేక మంది ఉన్నారని చెప్పారు. జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ వారణాసి కళావతి మాట్లాడుతూ విద్యార్థుల్లో జ్ఞాన తృష్ణ ఉండాలన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సీతంపేట : 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా రెండో రోజు శుక్రవారం పుస్తక ప్రదర్శన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల భౌతికశాస్త్ర ఉపాధ్యాయులు ముత్తిరెడ్డి గోవింద నాయుడు హాజరు అయ్యారు. పిల్లలకు విజ్ఞాన్ని అందించే పుస్తకాలు కథలు, జనరల్ నాలెడ్జ్, ప్రయోగాలు, వేదికగణితం, జాతీయ నాయకుల జీవిత విశేషాలు కథలు కాకుండా పోటీ పరీక్షలకు ఉపయోగపడే పుస్తకాలు ప్రదర్శించారు. అలాగే గ్రూప్స్ పుస్తకాలు, డీఎస్సీ, రైల్వే, బ్యాంకింగ్ వాటికి చదివే పుస్తకాలు వున్నాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని రకాల పుస్తకాలు అందుబాటులో ఉన్నాయని, వీటిని చదువుకొని విజ్ఞాన వంతులవ్వాలు కావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో స్థానిక గ్రంథాలయ అధికారి బబ్బురు గణేష్ బాబు, సహాయకులు రామకృష్ణ, పాఠకులు పాల్గొన్నారు.



గుమ్మలక్ష్మీపురం గ్రంథాలయంలో చదువుతున్న విద్యార్థులు

గుమ్మలక్ష్మీపురం : గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా స్థానిక గ్రంథాలయంలో డిగ్రీ విద్యార్థులు పుస్తక పఠనం చేశారు. ఈ సందర్భంగా వార్తాపత్రికలు, కథలు, నవలలు, పోటీ పరీక్షల పుస్తకాలు చదివారు. కొంతమంది విద్యార్థులు గ్రంథాలయంలో పుస్తక పఠనం కోసం సభ్యత్వ నమోదు చేయించుకున్నారు. గ్రంథాలయాల ప్రాధాన్యత, ప్రాముఖ్యత గురించి లైబ్రరియన్ డి.సుకన్య విద్యార్థులకు వివరించారు. ఖాళీ సమయాల్లో గ్రంథాలయానికి వచ్చి విలువైన పుస్తకాలను చదివి విజ్ఞానం పెంపొందించుకోవాలని కోరారు. కార్యక్రమంలో అధ్యాపకులు హరి, జగదీష్ ఉన్నారు.

గవర్నర్ దృష్టికి గిరిజనుల సమస్యలు : డివిజి

ప్రజాశక్తి - కురుపాం

గిరిజనుల సమస్యలను గవర్నర్ దృష్టికి తీసుకెళ్తానని ఎస్‌టి కమిషన్ చైర్మన్ డివిజి శంకరరావు అన్నారు. మండలంలోని దురిబిలి గ్రామాన్ని శుక్రవారం సందర్శించారు. అక్కడి గ్రామస్తులతో మమేకమై గిరిజనులు ఎదుర్కొంటున్న సమస్యలు, యువత ఉపాధి అవకాశాలు గూర్చి తెలుసుకున్నారు. అనంతరం గ్రామంలో ఎస్ సొసైటీ కార్యదర్శి షేక్ గౌస్ ఏర్పాటు చేసిన గ్రంథాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ గ్రామంలో చదువుకున్న యువత ఎక్కువగా ఉన్నారని తెలిసిందని, వారి కోసం స్వచ్ఛంద సంస్థ గ్రంథాలయం ఏర్పాటు చేయడం హర్షించదగ్గ విషయమని అన్నారు. ఈ గ్రంథాలయంలో ఉన్న పోటీ పరీక్షలు మెటీరియల్‌ను యువత సద్వినియోగం చేసుకొని ఉద్యోగాలు సాధించాలని అన్నారు. అలాగే గ్రామంలో ఉన్న ప్రతి ఒక్కరు కూడా ఈ గ్రంథాలయానికి వచ్చి కనీసం సంతకమైన నేర్చుకోవాలని సూచించారు. గ్రామంలో ఉన్న ప్రతి సమస్య తెలుసుకున్నానని సమస్యలన్నీ కూడా గవర్నర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారమయ్యేలా చేస్తానని అన్నారు. అనంతరం విలేకరులతో ఆయన మాట్లాడుతూ గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాలల్లో విద్యార్థులు మరణించడం బాధాకరమన్నారు. మృతి గల కారణాలు మూడు జిల్లాల కలెక్టర్లకు నివేదిక అడిగానని, వారు నివేదిక ఇచ్చిన వెంటనే ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి ఎఎన్ఎంలను నియమించేలా చర్యలు తీసుకుంటామని అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ పి.అజారి, ఎస్ సొసైటీ కార్యదర్శి ఎస్‌కె గౌస్, గిరిజన సంఘం నాయకులు ఐ.రామకష్ణ, లోవరాజు, చంద్రశేఖర్, సురేష్, గ్రామ పెద్దలు, యువత, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డివిజి శంకరరావు

ముని్సిపల్ ఉపాధ్యాయుల ఉద్యోగోన్నతులు చేపట్టాలి

ప్రజాశక్తి - పార్వతీపురం

ఉమ్మడి విజయనగరం జిల్లాలో వెంటనే మున్సిపల్ ఉపాధ్యాయుల ఉద్యోగోన్నతులు చేపట్టాలని యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.మురళీమోహన్‌రావు, పార్వతీపురం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు టి.రమేష్, కె.భాస్కరరావు డిమాండ్ చేశారు. ఈనెల మొదటి వారంలో చేపట్టాల్సిన ఉద్యోగోన్నతులు విజయనగరం జిల్లా స్థానిక సంస్థల ఎంఎల్‌సి ఉప ఎన్నికకు ఎన్నికల కోడ్ ఉందని నిలిపివేశారని వారు పేర్కొన్నారు. అయితే కోర్టు తీర్పు నేపథ్యంలో ఎన్నికల కోడ్ రద్దు అయినందున వెంటనే షెడ్యూల్ ప్రకటించి ఉద్యోగోన్నతులు చేపట్టాలని కోరారు. మొదట షెడ్యూల్ ఇచ్చినప్పుడు అన్ని సబ్జెక్టులకు సీనియారిటీ జాబితాలు ఇవ్వలేదని, అన్ని సబ్జెక్టులకు సీనియారిటీ జాబితాలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం మున్సిపల్ పాఠశాలల్లో ఖాళీ ఉన్న అన్ని స్కూల్ అసిస్టెంట్ పోస్టుల్లో 70:30 నిష్పత్తిలో 70శాతం పోస్టులకు ఉద్యోగోన్నతులు ఇవ్వాలని కోరారు. తెలుగు, హిందీ పోస్టులకు కూడా ప్రభుత్వం తగు ఆదేశాలు జారీ చేసి పదోన్నతులు ఇవ్వాలని కోరారు.

19న ప్రపంచ మరుగుదొడ్ల దినోత్సవం

ప్రజాశక్తి - పార్వతీపురం

ప్రపంచ మరుగుదొడ్ల దినోత్సవం ఈనెల 19న నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ తెలిపారు. ఈ మేరకు సంబంధిత అధికారులతో శుక్రవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సమీక్షించారు. ప్రపంచ మరుగుదొడ్ల దినోత్సవం సందర్భంగా 19 నుండి డిసెంబర్ 10 వరకు అవగాహనా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. జిల్లాలో పెద్ద ఎత్తున చేపట్టేందుకు జెడ్పీ సిఇఒ, డిపిఒ ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులు సమన్వయంతో పనిచేయాలని చెప్పారు. స్వచ్ఛ భారత్ మిషన్ కింద దీన్ని చేపడుతున్నట్టు తెలిపారు. మరుగుదొడ్ల వినియోగం ఆత్మ గౌరవం పెంపొందిస్తుందన్నారు. మహిళలు, బాలికలు బయటకు వెళ్లడం భద్రత రీత్యా కూడా మంచిది కాదని చెప్పారు. ఈనెల 19 నుండి డిసెంబరు 5 వరకు మరుగుదొడ్ల నిర్మాణానికి మంజూరు పత్రాలు జారీ, మరుగుదొడ్లను అందంగా తీర్చిద్దడం తదితర కార్యక్రమాలను చేపట్టనున్నట్టు తెలిపారు. డిసెంబరు 6 నుంచి 9 వరకు మరుగుదొడ్లు వినియోగంపై ప్రజలు, విద్యార్థుల్లో అవగాహన చేపట్టాలని ఆదేశించారు. సమావేశంలో ఆర్‌డబ్ల్యుఎస్ జిల్లా అధికారి ఒ. ప్రభాకరరావు తదితరులు పాల్గొన్నారు.

సీతంపేటలో క్లస్టర్ లెవెల్ క్రీడలు

ప్రజాశక్తి - సీతంపేట

జన జాతీయ గౌరవ దివాస్ క్లస్టర్ లెవెల్ క్రీడలు స్థానిక గిరిజన బాలుర ఆశ్రమ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో శుక్రవారం ప్రారంభించారు. ఈ క్రీడలకు సీతంపేట క్లస్టర్ లెవెల్ 23 పాఠశాలల నుంచి బాలబాలికలు పాల్గొన్నారు. వాలీబాల్, అర్చరీ, అథ్లెటిక్స్, క్రీడా పోటీలు నిర్వహించారు. క్రీడాకారులకు అన్ని సౌకర్యాలు కల్పించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం టి.చంద్రరావు, స్పోర్ట్స్ ఇన్‌ఛార్జ్ జాకబ్ దయానంద్, పీడీలు వెంకటరావు, జగదీష్, రవి, జనార్ధన్, రమణ, ఈశ్వర్, కామేశ్వరి, శైలజ పాల్గొన్నారు.

అక్కడ పెట్రోల్ బంక్ వద్దు

ఐటిడిఎ పిఒకు వినతి

ప్రజాశక్తి - పార్వతీపురం

కస్తూరిబా పాఠశాల, వివిధ కార్యాలయాల మధ్య పెట్రోల్ బంకు ఏర్పాటు చేయొద్దని, వేరొకచోట ఏర్పాటు చేయాలని కోరుతూ జిల్లా కలెక్టర్, జెసి, ఐటిడిఎ పిఒలకు సిపిఎం నాయకులు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిపిఎం నాయకులు వాకాడ ఇందిర, కొల్లి సాంబమూర్తి మాట్లాడుతూ కొమరాడ మండల కేంద్రానికి అతి సమీపంలో అటు కస్తూరిబాయ్ స్కూలు ఇటు పోలీస్ స్టేషన్, రజకులకు ఇచ్చిన చెరువు, పశువుల ఆస్పత్రి, హౌసింగ్ ఆఫీస్ మధ్యలో పెట్రోల్ బంక్ ఏర్పాటు చేయొద్దని కోరారు. రైతులు తమ పొలానికి వెళ్లే రహదారి స్థలంలో పెట్రోల్ బంకు వద్దన్నారు. దీనిపై ఐటిడిఎ పిఒ అశుతోష్ శ్రీ వాత్సవ్ మాట్లాడుతూ తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

సామూహిక రాయబారానికి తరలిరండి

విఆర్‌ఎల సంఘ జిల్లా అధ్యక్షులు ఈశ్వరరావు

ప్రజాశక్తి - కురుపాం

విజయవాడలో ఈనెల 18న చేపట్టబోయే విఆర్‌ఎల సామూహిక రాయబారానికి జిల్లాలో గల విఆర్‌ఎలంతా తరలివచ్చి జయప్రదం చేయాలని ఆ సంఘ జిల్లా అధ్యక్షులు జి.ఈశ్వరరావు పిలుపునిచ్చారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ విఆర్‌ఎలు రెవెన్యూ వ్యవస్థలో కింది స్థాయి ఉద్యోగులుగా పనిచేస్తున్నారని, వీరంతా చాలీ, చాలని వేతనాలతో ఇబ్బందులు పడుతూ జీవితాలు గడుపుతున్నారని అన్నారు. విఆర్‌ఎల సమస్యలు పరిష్కరించాలని గతంలో జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం దృష్టికి కూడా తీసుకెళ్లిందన్నారు. అయినా ఏ ఒక్క సమస్య పరిష్కారం కాలేదు సరికదా విఆర్‌ఎలను మోసగించారని విమర్శించారు. ప్రస్తుతం రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలో ఉందని, గతంలో ఇచ్చిన నిబంధనలకు విరుద్ధంగా ప్రస్తుత కార్యాలయంలో రాత్రిపూట విఆర్‌ఎలు నైట్ డ్యూటీలు చేయాలని మెమోను ఉప సంహరించాలని డిమాండ్ చేశారు. అలాగే రాష్ట్ర వ్యాప్తంగా ఖాళీగా ఉన్న అటెండర్, వాచ్మెన్, రికార్డ్ అసిస్టెంట్లు, విఆర్‌ఒ తదితరు పోస్టుల్లో అర్హులైన విఆర్‌ఎలను నియమించి ప్రమోషన్లు కల్పించి న్యాయం చేయాలని కోరారు. విఆర్‌ఎల కుటుంబాలను ఆదుకునేందుకు తెలంగాణ రాష్ట్రంలో అమలౌతున్న విధంగా మన రాష్ట్రంలోనూ విఆర్‌ఎలకు పేస్కేలు అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరుతూ రాయబారానికి వెళ్తున్నామని అన్నారు.

చెత్త నుంచి సంపద సృష్టిపై అవగాహన

ప్రజాశక్తి - సాలూరు

మున్సిపాలిటీలో చెత్త నుంచి సంపద సృష్టించడంపై శుక్రవారం స్థానిక సీతారామ కళ్యాణమండపంలో అవగాహన సదస్సు నిర్వహించారు. సాలిడ్, లిక్విడ్ వేస్ట్ మేనేజ్మెంట్ కార్యక్రమంలో భాగంగా సాలూరు పట్టణ, మండల శానిటేషన్ సెక్రటరీలకు అవగాహన కల్పించారు. నోడల్ అధికారి డిపిఒ ప్రసూన ఈ సందర్భంగా మాట్లాడుతూ పట్టణ ప్రాంతాల్లో స్వచ్ఛ సుందర దృశ్యాలు కనబడాలంటే ప్రజల భాగస్వామ్యంతో చెత్త నుంచి సంపద ఎలా సృష్టించవచ్చో తెలిపే వీడియోలను చూపించారు. ప్రతి ఇంట్లో ఉత్పత్తి అయ్యే చెత్తను రోడ్లపై, కాలువల్లో వేయకుండా సంపద సృష్టి కోసం కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో కమిషనర్ సత్యనారాయణ, ఎంపిడిఒ రమాదేవి, రిసోర్స్ పర్సన్ పద్మజ పాల్గొన్నారు.



శిక్షణలో మాట్లాడుతున్న ఎంపిడిఒ త్రివిక్రమరావు

ఆర్థిక వనరులతో గ్రామాల అభివృద్ధి

ప్రజాశక్తి - సీతానగరం

గ్రామాల అభివృద్ధికి ఆర్థిక వనరులను సేకరించాలని ఎంపిడిఒ పి.త్రివిక్రమరావు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం జిపిడిపిపై శిక్షణ నిర్వహించారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో మౌలిక సదుపాయాలపై ముందస్తు ప్రణాళికలతో గ్రామ స్వరూపం భౌగోళిక పరిస్థితులను అనుసరించి ఆర్థిక వనరులను సేకరించాలన్నారు. వీటితో గ్రామాలకు చెందిన వివిధ సమస్యలను పరిష్కరించుకోవాలని, ఆదాయ వనరులను తెలుసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్స్ శ్రీనివాసరావు, మనోజ్ కుమార్, హౌసింగ్ ఎఇ జానకీరామ్, ఎపిఎం శ్రీరాములు, ఎంఇఒ సూర్యదేవుడు, ఆర్డబ్ల్యుఎస్ ఎఇ, వివిధ గ్రామాలకు చెందిన కార్యదర్శులు, విఒఎలు, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.



విద్యార్థులకు స్టడీ మెటీరియల్‌ను అందజేస్తున్న ఎంఇఒ

బాలల హక్కులపై విద్యార్థులకు అవగాహన

ప్రజాశక్తి - కురుపాం

బాలల హక్కులపై విద్యార్థులకు అవగాహన తప్పనిసరిగా ఉండాలని ఎంఇఒ ఎన్.సత్యనారాయణ అన్నారు. మండలంలోని బియ్యాలవలస ఎంపిపి పాఠశాలలో శుక్రవారం బాలల హక్కుల వారోత్సవాల కార్యక్రమంలో భాగంగా ఎస్ సొసైటీ కార్యదర్శి ఎస్‌కె గౌస్ ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన సదస్సుకు ముఖ్యఅతిథిగా ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలల హక్కులపై ప్రతి విద్యార్థికి అవగాహన ఉండాలన్నారు. బడి ఈడు పిల్లలు తప్పకుండా బడికి వెళ్లి సక్రమంగా చదువుకోవాలని, ప్రభుత్వం విద్యాభివృద్ధికి అందిస్తున్న సహకారాన్ని అందిపుచ్చుకొని మంచి విద్యావంతులుగా ఎదగాలని అన్నారు. అనంతరం 45 మంది విద్యార్థులకు ఎస్ సొసైటీ వారు స్టడీ మెటీరియల్‌ను ఎంఇఒ చేతుల మీదుగా అందించారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ పి.అజారి, పంచాయతీ కార్యదర్శి వెంకట నాయుడు, విఆర్ఒ అప్పలనాయుడు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు పాండు, ఉపాధ్యాయులు మజ్జి ఉపేంద్ర, గ్రామ పెద్దలు, ఎస్ఎంసి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

విద్యార్థుల ప్రాణాలు కాపాడాలి

ప్రజాశక్తి - కొమరాడ

గిరిజన సంక్షేమ ఆశ్రమ వసతి గృహాలతో పాటు వివిధ పాఠశాలల్లో పూర్తిస్థాయిలో సిబ్బందిని నియమించి విద్యార్థుల ప్రాణాలు, ఆరోగ్యాలను కాపాడుతూ నాణ్యమైన విద్యా బోధన, భోజన వసతులు సక్రమంగా కల్పించాలని సిపిఐ మండల నాయకులు కొల్లి సాంబమూర్తి డిమాండ్ చేశారు. శుక్రవారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ ఐటిడిఎ కాలంలో గిరిజన సంక్షేమ పాఠశాలల్లో చదువుతున్న సుమారు 9 మంది విద్యార్థులు మెరుగైన వైద్యం అందక చనిపోవడం బాధాకరమైన విషయమన్నారు. భవిష్యత్తులో విద్యార్థుల మరణాలను అరికట్టేందుకు అన్ని గిరిజన సంక్షేమ, ఆశ్రమ పాఠశాలల్లో ఎఎన్ఎంలను, వాచ్మెన్, పీడీలను నియమించాలని డిమాండ్ చేశారు.

బడ్జెట్‌లో దళితులకు నామమాత్రపు కేటాయింపులు

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

దళితులకు బడ్జెట్‌లో నామమాత్రపు కేటాయింపులు చూసి కూటమి ప్రభుత్వం దళితులపై నిర్లక్ష్యం అర్థమవుతుందని దళిత హక్కుల పోరాట సమితి జిల్లా నాయకులు తోట జీవ, జి.జనార్దన్, సబ్బ నానిబాబు, గురుబిల్లి సూర్యం అన్నారు. శుక్రవారం వారు ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్ర ప్రభుత్వం దళిత సంక్షేమానికి రూ.18,497 కోట్లు మాత్రమే కేటాయించడం ఎంతవరకు సమంజసమని నిలదీశారు. ఇది గత బడ్జెట్ కన్నా రూ.150 కోట్లు తక్కువ కేటాయించడం అన్యాయమని అన్నారు. జనాభా దామాషా పద్ధతి ప్రకారం దళిత సంక్షేమానికి 17 శాతం లెక్కన రూ.23వేల కోట్లు కేటాయించాల్సి ఉండగా, కేవలం రూ.18 వేల కోట్లు కేటాయించడం చూస్తే దళితులను అవమానించడమేనని అన్నారు. దళిత సంక్షేమానికి బడ్జెట్లో అధిక నిధులు కేటాయించడానికి దళితులంతా ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు.

వ్యాధులను సత్వరమే గుర్తించాలి

ప్రజాశక్తి - గరుగుబిల్లి

వ్యాధులను సత్వరమే గుర్తించాలనే ధ్యేయంగా, ఆరోగ్య సర్వేలు వైద్యారోగ్యశాఖ నిర్వహిస్తుందని జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ టి.జగన్మోహన రావు అన్నారు. ఈ మేరకు ఎస్ఆర్ పేటలో శుక్రవారం ఆకస్మికంగా సందర్శించి వైద్య సిబ్బంది చేపడుతున్న ఎన్‌సిడి 3.0, సాన్స్ సర్వేతో పాటుగా ఇతర ఆరోగ్య కార్యక్రమాల నిర్వహణ తీరును పరిశీలించారు. పూర్తిస్థాయిలో సర్వే చేపడుతున్నారా, లేదా సర్వే చేపడుతున్న ఇళ్ల వద్ద ఆయన సందర్శించి వైద్య పరీక్షల నిర్వహణ తీరును పరిశీలించారు. గృహస్తులతో మాట్లాడి ఏవైనా ఆరోగ్య సమస్యలున్నాయా అని అడిగి తెలుసుకున్నారు. న్యుమోనియా తదితర శ్వాస సంబంధిత లక్షణాలతో ఎవరినైనా గుర్తించారా అని అడుగుతూ గృహ సందర్శన చేసి తల్లిదండ్రులతో మాట్లాడి పిల్లల్లో దగ్గు, జ్వరం, శ్వాస త్వరగా తీసుకోవడం లాంటి సమస్యలు ఏవైనా ఉన్నాయా అని అడిగి తెలుసుకుని, తగు జాగ్రత్తలు సూచించారు. ఫ్రైడే-డ్రైడే ఏ మేరకు చేపట్టారో వీధుల్లో గమనించారు. ఈ కార్యక్రమంలో ఎపిడెమిక్ ఇఒ సత్తిబాబు, వైద్య సిబ్బంది ఎ, ఆశా కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

అంపిలిలో గ్రామసభ

ప్రజాశక్తి -పాలకొండ

మండలంలోని అంపిలిలో శుక్రవారం ఉదయం గ్రామసభ నిర్వహించారు. ఉపాధి హామీ చట్టం ప్రణాళిక ప్రక్రియ 2025-26లో పనుల గుర్తింపు అంశంపై ఈ గ్రామ సభలో చర్చించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ గ్రామసభ నిర్వహించినట్లు సర్పంచ్ లోలుగు విశ్వేశ్వరరావు తెలిపారు. కార్యక్రమంలో పాలకొండ తెలుగు యువత ఉపాధ్యక్షులు వాకమూడి వెంకటేష్, గ్రామ ప్రజలు,సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

శరవేగంగా ఆలయ నిర్మాణం

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని చల్లమనాడువలస బిసి కాలనీలో అభయ ఆంజనేయ ఆలయ పనులు శరవేగంగా జరుగుతన్నారు. ఈ నిర్మాణ పనులను లక్ష్మీపురం మాజీ ఎంపీటీసీ దాసరి నాగరత్నం ఆధ్వర్యంలో జరుగుతున్నాయి. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు దాసరి చిన్నమనాయుడు, దాసరి సత్యనారాయణ, దాసరి నాగరాజు, త్రినాధరావు, తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థుల మరణాలపై దృష్టి సారించాలి

జనజాతీయ గౌరవ దివస్ సభలో ఎస్‌టి కమిషన్ ఛైర్మన్ డివిజి శంకరరావు

ప్రజాశక్తి - పార్వతీపురం

గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో విద్యార్థుల మరణాలపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించాలని రాష్ట్ర ఎస్టీ కమిషన్ ఛైర్మన్ డాక్టర్ డివిజి శంకరరావు కోరారు. స్థానిక ఐటిడిఎ కార్యాలయ ఆవరణలో బిర్సా ముండా జయంతి సందర్భంగా నిర్వహించిన జన జాతీయ గౌరవ దివాస్‌ను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. కలెక్టర్ శ్యాం ప్రసాద్ జ్యోతి ప్రజ్వలన చేసి బిర్సా ముండా చిత్ర పటానికి పూలమాలలు వేశారు. ప్రాంగణంలో ఏర్పాటు చేసిన వివిధ శాఖల ప్రదర్శన శాలలు సందర్శించారు. అనంతరం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఎస్‌టి కమిషన్ ఛైర్మన్ మాట్లాడుతూ బిర్సా ముండా స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొనటమే కాకుండా గిరిజనుల్లో గొప్ప చైతన్యం తీసుకువచ్చారన్నారు. బిర్సా ముండా స్ఫూర్తితో చైతన్యం పొందాలని కోరారు. విద్య గొప్ప ఆయుధమని, గిరిజన విద్యా శాతం పెరగాలని ఆయన పిలుపునిచ్చారు. ఏజెన్సీలో గిరిజనులకు వందశాతం ఉద్యోగాల కల్పనకు సంబంధించిన



అటవీ ఉత్పత్తులను పరిశీలిస్తున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్



గిరిజన సంప్రదాయ నృత్యం చేస్తున్న విద్యార్థులు

జీవో 3ను పునరుద్ధరించాల్సిన అవసరం ఉందన్నారు. కలెక్టర్ ఎ. శ్యామ్ ప్రసాద్ మాట్లాడుతూ ఐకమత్యంతో హక్కులు కాపాడుకోవచ్చన్నారు. జన్ మాన్ కార్యక్రమం కింద జిల్లాలో అనేక ప్రతిపాదనలు సమర్పించామని చెప్పారు. వన్ ధన్ వికాస్ కేంద్రాలు (విడివికె) ను రూ.15.25 కోట్లతో బలోపేతానికి నిధులు మంజూరు చేశామన్నారు. ఎస్‌పి ఎస్‌వి మాధవ రెడ్డి మాట్లాడుతూ గిరిజనులు అన్ని రంగాల్లో ముందంజలో ఉండాలన్నారు. ఐటిడిఎ పిఒ అశుతోష్ శ్రీవాస్తవ మాట్లాడుతూ గిరిజనుల అభివృద్ధికి శాయశక్తులా కృషి చేస్తామన్నారు. ఎఎస్‌పి అంకిత సురానా మాట్లాడుతూ గిరిజన సంస్కృతి, సాంప్రదాయాలను పరిరక్షించుకోవాల్సిన అవసరం ఉందని అన్నారు. మాజీ ఎమ్మెల్యే నిమ్మక జయరాజు, గిరిజన సంఘ నాయకులు నందివాడ కృష్ణ బాబు, పాలక రంజిత్ కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వ విధానాలు గిరిజనుల అభివృద్ధికి మరిన్ని పథకాలు, విధానాలు అవసరమన్నారు. కార్యక్రమంలో పార్వతీపురం మున్సిపల్ ఛైర్ పర్సన్ బోను గౌరీశ్వరి, జిల్లా గిరిజన సంక్షేమ సాధికారిత అధికారి ఎం.డి గయాజుద్దీన్, జిసిసి డివిజనల్ మేనేజర్ వి.మహేంద్రకుమార్, విద్యుత్ శాఖ ఎస్ఇ చలపతిరావు, గిరిజన సంఘాల నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

గుమ్మలక్ష్మీ పురం, కురుపాం ఏకలవ్య మోడల్ పాఠశాల, గిరిజన సంక్షేమ గురుకులం, పి.రేగిడి, కొత్తవలస గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహూతులను అలరించాయి. కార్యక్రమంలో జీడి పునరుద్ధరణ పథకం కింద రైతులకు రూ.45 లక్షల చెక్కును, గొర్రెలు - మేకల పెంపకంకు రూ.15 లక్షల చెక్కును, ఐదు తుంపర సేద్యం యూనిట్లు, ఐస్ బాక్స్ లతో కూడిన ఐదు మోపెడ్ లు, ఐదు నెట్ లు., ఐదు ఆయిల్ ఇంజిన్లు, ఆర్ఒఎఫ్ ఆర్ కింద 27 పట్టాలను, ఆధార్ కార్డులు, ఆరోగ్య కార్డులు పంపిణీ చేశారు.

సీతంపేట : స్థానిక ఐటిడిఎలో బిర్సా ముండా జయంతిని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఐటిడిఎ ఎఒ సునీల్, ఎఎఒ విజయరాణి, డిడి సెక్షన్ సూపరింటెంట్ దేశ్, ఇతర ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

జెఎసి ఆధ్వర్యాన...

స్థానిక ప్రభుత్వ గిరిజన బాలుర ఆశ్రమ పాఠశాలలో ఏజెన్సీ ఆదివాసీ జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో బిర్సాముండా జయంతి నిర్వహించారు. గిరిజన జెఎసి నాయకులు కొండగురి ధర్మారావు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు చంద్రరావు, జెఎసి గౌరవ



బిర్సా చిత్రపటం వద్ద నివాళ్లు అర్పిస్తున్న కలెక్టర్, పిఒ, ఎఎస్‌పి

అధ్యక్షులు రామస్వామి, ప్రధాన కార్యదర్శి సవర చిరంజీవి, కార్యదర్శులు బిడ్డిక ఉమామహేశ్వరరావు, మోహన్ పాల్, కొండగొర్రి భాస్కరరావు, ఆరిక తిరుమలరావు, వూయిక చందు, నిమ్మక రమేష్, ఆరిక సుందర్రావు, నిమ్మక కాంతారావు, ఉపాధ్యాయులు కుండంగి ప్రమోద్, పాలక పురుషోత్తం, సూరిబాబు, మూటక రవి పాల్గొన్నారు.

గుమ్మలక్ష్మీపురం: స్థానిక సారధి ఒకేషనల్ కళాశాలలో ట్రైబల్ రైట్స్ ఫోరం, కళాశాల యాజమాన్యం సంయుక్తంగా భగవాన్ బిర్సా ముండ 150వ జయంతోత్సవాలు నిర్వహించారు. ఎల్విన్‌పేట సిఐ బి.హరి మాట్లాడుతూ విద్యార్థులంతా క్రమశిక్షణతో చదువుతూ జీవితంలో ఉన్నతమైన శిఖరాలను అధిరోహించాలని, వ్యసనాలకు దూరంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ట్రైబల్ రైట్స్ ఫోరం రాష్ట్ర అధ్యక్షులు రోబ్బా లోవరాజు, జిల్లా అధ్యక్షులు రామకృష్ణ, ఎస్ఐ బి.శివప్రసాద్, ప్రిన్సిపల్ శేషగిరి రావు, ఎస్.రాజేష్, గిరిజన విద్యార్థి సంఘం జిల్లా గౌరవ అధ్యక్షులు డి.సురేష్ ఉన్నారు.

సాలూరు : మాజీ డిప్యూటీ సిఎం రాజన్నదొర తన నివాసంలో జరిగిన కార్యక్రమంలో బిర్సా ముండా చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పట్టణ వైసిపి అధ్యక్షులు వంగపండు అప్పలనాయుడు, వైస్ ఎంపిపి రెడ్డి సురేష్, వైసిపి నాయకులు గోవిందరావు, మధుసూదనరావు పాల్గొన్నారు.

జియ్యమ్మవలస: మండలంలోని రావాడలో బిర్సా ముండా 150వ జయంతి వేడుకలను ఆరిక చంద్రశేఖర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. రావాడ రామభద్ర పురం పిహెచ్‌సిలో రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు ఎస్.మాణికేశ్వం రావు, వి.సింహాచలం, బాలకృష్ణ, శ్రీను. నూకరాజు పాల్గొన్నారు.

వ్యసనాల బారినపడి జీవితాలను పాడు చేసుకోవద్దు

ప్రజాశక్తి - వీరఘట్టం

చక్కగా చదివి ఉన్నత శిఖరాలు అవలంభించాలి తప్ప మాదకద్రవ్యాలకు అలవాటు పడి జీవితాలు పాడు చేసుకోవద్దని స్థానిక ఎస్సై జి.కళాధర్ విద్యార్థులకు సూచించారు. శుక్రవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సంకల్పంలో భాగంగా విద్యార్థులతో అవగాహనలో మాట్లాడారు. మాదకద్రవ్యాలకు అలవాటు పడితే సమాజంలో విలువలు కోల్పోయే వారిగా మిగిలిపోతారన్నారు. కష్టపడి చదివి కళాశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని విద్యార్థులను కోరారు. అత్యవసర పరిస్థితుల్లో 112కు కాల్ చేయాలని సూచించారు. ఈ సందర్భంగా కళాశాలలో సంకల్పం ఫిర్యాదులు పెట్టి ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ ఎం.కుమారస్వామి, అధ్యాపక, పోలీస్ సిబ్బందితోపాటు విద్యార్థులు, పాల్గొన్నారు.

సీతంపేట : యువత మాదక ద్రవ్యాలకు బానిసవ్వొద్దని, జీవితాన్ని కోల్పోవద్దని ఎస్సై వై.అమ్మన్నరావు పిలుపునిచ్చారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సంకల్పం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాదకద్రవ్యాలు నిరోధానికి సహకరించాలన్నారు. గంజాయి, ఖైనీ, గుట్కా మత్తులో యువత గురై బంగారు భవిష్యత్తుకు బాటలు వేయలన్నారు. యాంటీ డ్రగ్స్ నిరోధకంపై అవగాహన కల్పించారు. మహిళలు భద్రత రక్షణ గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. సైబర్ నేరాలపై వివరించారు. చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. యువతకు చట్టాల గురించి వివరించారు. కార్యక్రమంలో డిగ్రీ కళాశాల బోధకులు, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

కురుపాం : సైబర్ నేరాలు, మహిళా భద్రతలపై యువతకు అవగాహన ఉండాలని ఎఎస్సై నరసింహులు సూచించారు. సంకల్పం కార్యక్రమంలో భాగంగా మండలంలోని దురిబిలి లో యువతకు సైబర్ నేరాలు, రోడ్డు ప్రమాదాలు, మహిళా భద్రత, ఇతరత్రా నేరాల పట్ల అవగాహన కల్పించారు. డ్రగ్స్, గంజాయి, మద్యం తదితర మాదకద్రవ్యాలకు దూరంగా ఉన్నప్పుడే ఉన్నతస్థాయికి చేరుకుంటారని తెలిపారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ పి. అజారీ, గ్రామ పెద్దలు, యువత పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



వీరఘట్టంలో విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతున్న ఎస్ఐ కళాధర్



పాచిపెంటలో సచివాలయ సిబ్బందితో మాట్లాడుతున్న తహశీల్దార్ రవి

ఉచిత ఇసుకపై అవగాహన సదస్సు

ప్రజాశక్తి - సీతానగరం

స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఉచిత ఇసుకపై అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఎంపిడిఒ పి.త్రివిక్రమరావు మాట్లాడుతూ ఇసుక రీచ్‌లో ఇసుక వచ్చే ట్రాక్టర్లు, నాటుబళ్లను ఆన్లైన్లో నోట్ చేయాలన్నారు. అలాగే జెసిబిలకు, లారీలకు అనుమతుల్లేవని, అలాగే మూడు షిఫ్టులు వారీగా రీచ్ వద్ద పనిచేయాలని అన్నారు. రోజువారీ వాహనాలను, ఎడ్లబళ్లను తనిఖీలు చేసి, అనుమతి ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ఎస్సై ఎం.రాజేష్, ఎపిఒ పి.భాను, పలువురు పంచాయతీ కార్యదర్శులు, మహిళా పోలీసులు, సర్వేయర్లు, రెవెన్యూ కార్యదర్శులు పాల్గొన్నారు.

పాచిపెంట : మండలంలో కర్రివలస, మాతుమూరు, మోసూరు, పాంచాలి ఇసుక రీచ్‌ల నుంచి ముందస్తు అనుమతులతో ఇసుక రవాణా చేయాలని తహశీల్దార్ డి.రవి, ఎంపిడిఒ పాత్రో తెలిపారు. శుక్రవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో సచివాలయ సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఇసుక రీచ్‌ల్ల వద్ద స్విఫ్ట్ పద్ధతితో 24 గంటలు విధులు నిర్వహించాలని ఆదేశించారు. అక్రమ రవాణాకు పాల్పడిన వారిపై నిఘా ఉంచి స్థానిక పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు.

భూ తగాదాలో రైతుకు గాయం

పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు

వివాద భూమిని పరిశీలించిన తహశీల్దార్

ప్రజాశక్తి - మక్కువ

మండలంలోని మార్కొండపుట్టు పంచాయతీ పరిధిలో పెద గైసిల రెవెన్యూ పరిధిలో శుక్రవారం జరిగిన భూ వివాదంలో రైతు భాగవతుల నరసింహులుపై దాడి జరిగిన నేపథ్యంలో గాయపడ్డాడు. సర్వే నెంబర్ 80-1 లో రెండు ఎకరాలు, దాని పరిసరాల్లో ఉన్న భూమిపై గత కొద్ది రోజులుగా మార్కొండపుట్టికి చెందిన దళితులు కన్నపుదొర సాంబయ్య తదితరులకు అదే గ్రామానికి చెందిన భాగవతుల నరసింహులకు వివాదం చోటు చేసుకుంది. గతంలో మక్కువ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు కూడా నమోదైంది. శుక్రవారం ఉదయం అదే భూమిపై ఆయిల్ పామ్ సాగు చేస్తున్న రైతు నరసింహులు పంటను కన్నపుదొర సాంబయ్య వగైరాలు నాశనం చేస్తుండగా అడ్డుకునే ప్రయత్నం నరసింహులు చేశాడు. ఇది తమ భూమి అటూ కన్నపుదొర సాంబయ్య ఆధ్వర్యంలోని దళితులు, తన జిరాయితీ భూమంటూ రైతు నరసింహులు మధ్య వివాదం రేగింది. ఈ ఘర్షణలో రైతు నరసింహులు గాయపడ్డాడు. ప్రస్తుతం వివాదం తహశీల్దార్ షేక్ ఇబ్రహీం ఫిర్యాదు అందడంతో శుక్రవారం సాయంత్రం ఆయన తన సర్వే బృందంతో భూమిని పరిశీలించారు. ఇంకా వివాదం సద్దుమణగకపోవడంతో మంగళవారానికి ఇరు వర్గాలను తమ వద్దనున్న ఆధారాలతో మళ్లీ రావాలని ఆయన వారికి తెలిపారు. ఇదిలా ఉండగా సాలూరు సిహెచ్‌సిలో రైతు నరసింహులు చికిత్స పొందుతున్నాడు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు బొంగు వాసుదేవరావు, మాజీ సర్పంచ్ తేలు శ్రీరాములునాయుడు, చొక్కాకు బుచ్చినాయుడు తదితరులు పాల్గొన్నారు.

పలు గ్రామాల్లో పల్లెనిద్ర

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

మండలంలోని గుమ్మలక్ష్మీపురం, ఎల్విన్ పేట, తాడికొండ, కోసింగి భద్ర గ్రామాల్లో గల గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో ప్రత్యేక అధికారులు గురువారం రాత్రి పల్లె నిద్ర చేశారు. శుక్రవారం ఉదయం విద్యార్థులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వసతి గృహాల పరిసరాలు, ఆహార పదార్థాలు, విద్యా బోధన తదితర అంశాలను పరిశీలించారు. గ్రామాల్లో పర్యటించి పారిశుధ్యం, తాగునీరు, వైద్య సేవలు పరిశీలించారు. కార్యక్రమంలో ప్రత్యేక అధికారులు ఎం.రమణమ్మ, చంద్రరావు, సర్పంచులు బి.గౌరీశంకర్రావు, ఎం.జగ్గా రావు, ఎంపిటిసి కడ్రక మల్లేశ్వరరావు, సచివాలయం సిబ్బంది ఉన్నారు.

మక్కువ: మండలంలోని ఎర్రసామంతవలస గిరిజన ఆశ్రమ పాఠశాలలో గురువారం రాత్రి స్థానిక తహశీల్దార్ షేక్ ఇబ్రహీం పల్లెనిద్ర కార్యక్రమంలో పాల్గొన్నారు. విద్యార్థుల ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించినట్టు ఆయన విలేకరులకు తెలిపారు. విద్యార్థులు పడుకునే పడకల ట్రాక్ ఎత్తు ఎక్కువగా ఉందని, నిద్రమత్తులో విద్యార్థులు వస్తే ఫ్యాన్లు తలకు తగిలి ప్రమాదం జరిగే ఆస్కారం ఉందని అన్నారు. అలాగే భోజనశాల నేలపైన కూర్చొని విద్యార్థులు భోజనం చేయాల్సి వస్తుందన్నారు. అలాగే అంగన్వాడీ, చెత్తశుద్ధి కర్మాగారాలను పరిశీలించామన్నారు. రోడ్ల ఆక్రమణకు సంబంధించి సమస్యలను గుర్తించినట్టు తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ పుష్పనాథం, అంగన్వాడీ కార్యకర్తలు, సిబ్బంది పాల్గొన్నారు.



గుమ్మలక్ష్మీపురంలో విద్యార్థులతో మాట్లాడుతున్న ప్రత్యేకాధికారి



పోడు వ్యవసాయంపై అవగాహన కల్పిస్తున్న అటవీశాఖాధికారి రామ్‌నరేష్

పోడు వ్యవసాయ పరిరక్షణకు హాని

ప్రజాశక్తి పార్వతీపురంరూరల్

పోడు వ్యవసాయంతో పర్యావరణ పరిరక్షణకు హాని కలుగుతుందని స్థానిక అటవీశాఖ రేంజ్ అధికారి రామ్ నరేష్ బిర్లంగి అన్నారు. ఈ మేరకు శుక్రవారం సీతంపేట గిరిజన గ్రామంలో అటవీశాఖ ఆధ్వర్యంలో సెక్షన్ అధికారి మనోజ్, సిబ్బందితో కలిసి గ్రామ ప్రజలను పోడు వ్యవసాయం చేయరాదని, అడవులను రక్షించుకోవాల్సిన అవసరం ఉందని తెలిపారు. రేంజ్ అధికారి ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతూ అడవులను రక్షించుకుంటే మనకు ఆహారం, నీరు స్వచ్ఛమైన గాలి అందుతుందని తద్వారా పర్యావరణాన్ని రక్షించిన వారవుతామని, భావితరాలకు మంచి వాతావరణంతో కూడిన ఆరోగ్యవంతమైన వనరుల్ని ఇచ్చిన వారవుతామని గ్రామస్తులకు తెలిపారు. వారి చుట్టుపక్కల గల అటవీ ప్రాంతాల్లో ఎటువంటి పోడు చేయరాదని, తద్వారా కలిగే పర్యావరణ సమస్యలను వారికి వివరించారు. అలాగే గంజాయి సాగు చేయరాదని గ్రామస్తులకు సూచించారు. అంతేకాక గ్రామానికి కావాల్సిన తాగునీరు, విద్య, వైద్యం అందించడానికి వివిధ స్వచ్ఛంద సేవా సంస్థలతో మాట్లాడి తగిన సహాయ సహకారాలు చేస్తామని గ్రామస్తులకు తెలిపారు. ముఖ్యంగా అటవీభూములను కాపాడాల్సిన బాధ్యత మనందరి పైనా ఉందని వారికి ప్రత్యేకంగా అవగాహన కల్పించినట్టు తెలిపారు. నిప్పు నుంచి ఆడవిని రక్షించుకోవాల్సిన అవసరం ఉందని, రాబోయే వేసవిలో అడవికి నిప్పు చేరకుండా చూసుకోవాల్సిన బాధ్యత ఆందరికీ ఉందని తెలిపారు. కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు రాము, వరహాలమ్మ, సత్యనారాయణ, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ఉద్యోగాలిప్పిస్తామని టోకరా

ప్రజాశక్తి-పార్వతీపరం టౌన్

జిల్లా కేంద్రంలో పట్టణానికి చెందిన ఒక మహిళ పలువురు మహిళలకు ఇంటి స్థలాలు, టిట్కో ఇళ్లు, ఉద్యోగాలు ఇస్తామని చెప్పి లక్షలాది రూపాయలు తీసుకొని, ఫోర్జరీ చేసిన పత్రాలు ఇచ్చి మోసం చేసినట్లు పలువురు మహిళలు వాపోతున్నారు. ఆ మహిళను నిలదీస్తే మీకు నచ్చినట్లు చేసుకోండి అని చెబుతుందని, ఆ మహిళ వలన లక్షలాది రూపాయలు పోగొట్టుకున్నామని బాధితులు పట్టణ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసేందుకు సమాయత్త మవుతున్నారు. ఈ విషయం పట్టణ సిఐ నారాయణరావు దృష్టికి తీసుకు వెళ్లగా తమ దగ్గరకు వచ్చి ఆ మహిళ గురించి బాధితులు చెప్పారని, ఆధారాలతో వస్తే కేసు నమోదు చేస్తామని చెప్పినట్లు తెలిపారు.

పది మద్యం సీసాలు స్వాధీనం

ప్రజాశక్తి - సీతానగరం

మండలం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ పరిధిలో గాదెలవలసలో దాడులు చేయగా ఒక బెల్ట్ షాప్ నిర్వాహకునిపై కేసు నమోదు చేసి, 10 మద్యం సీసాలు స్వాధీనం చేసుకొని అరెస్టు చేసినట్టు ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ డి.పద్మావతి తెలిపారు. ఈ మేరకు ఆమె మాట్లాడుతూ బలిజిపేట మండలంలోని మద్యం షాపుల్లో గత నెల 16 నుండి ఇప్పటి వరకు రూ.99 ధర కలిగిన మద్యం సీసాలు 390 పెట్టెలు డిపో నుంచి షాప్ లకు పంపగా 374 పెట్టెలు అమ్మివేయగా ఇంకా 26 పెట్టెలు అందుబాటులో ఉన్నాయన్నారు. తమ స్టేషన్ పరిధిలో గత 20 రోజుల్లో బలిజిపేట మండలం తుమరాడ, పెద్దింపేట, మిర్తివలస, బర్లి గ్రామాల్లో అనధికార బెల్ట్ షాపుల్లో దాడులు చేయగా 9 కేసులు నమోదు చేసి ఏడుగుర్ని అదుపులో తీసుకొని, వారి నుంచి 175 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. బలిజిపేట, సీతానగరం, గరుగుబిల్లి మండలాల్లో ఎటువంటి అనధికారి మద్యం, నాటుసారా విక్రయించినా చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రైవేట్ మద్యం దుకాణాల్లో ఎంఆర్‌పి ధరల కంటే అధిక ధరలకు మద్యం విక్రయిస్తే 9440902373 ఫోన్ నెంబర్‌కు సంప్రదించాలని తెలిపారు. సమావేశంలో ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.



ఇసుక పాళ్లతో నిర్మిస్తున్న రోడ్డు

వనంగుడి రహదారి పనుల్లో నాణ్యతా లోపం

ఇసుక శాతమే ఎక్కువంటున్న స్థానికులు

ప్రజాశక్తి - మక్కువ

మండలంలోని శంబర పోలమాంబ అమ్మవారి వనం గుడి పరిసరాల్లో జరుగుతున్న రహదారి పనుల్లో నాణ్యత కానరవడంలేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. పోలమాంబ ఆలయాలన్ని అభివృద్ధి పరచాలనే లక్ష్యంతో కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ ఇంజినీరింగ్ అధికారులతో ప్రణాళిక సిద్ధం చేశారు. అనంతరం వనం గుడి ప్రాంతంలో రహదారుల అభివృద్ధికి సుమారు రూ.45 లక్షలు నిధులు మంజూరయ్యాయి. ఈ రహదారి అభివృద్ధి పనులకు గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి అక్టోబర్‌లో శంకుస్థాపన చేశారు. అనంతరం రహదారి పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. అయితే వనం గుడి వద్ద జరుగుతున్న సిమెంట్ రోడ్ల కింది భాగం పనులు నాసిరకంగా జరుగుతున్నాయని స్థానిక ఆరోపిస్తున్నారు. 40 ఎంఎం మెటల్ వినియోగిస్తూ చేపడుతున్న పనుల్లో నాణ్యతా లోపం కట్టొచ్చినట్లు కనిపిస్తుందని పలువురు ఆరోపిస్తున్నారు. ఈ పనులు జరుగుతున్న సందర్భంగా అధికారులు పర్యవేక్షణ కూడా అంతంత మాత్రమే ఉందంటున్నారు. ప్రతి ఏటా పోలమాంబ అమ్మవారి వద్దకు లక్షలాది మంది భక్తులు వచ్చి పోయే రహదారులు నాసిరకంగా నిర్మిస్తే ఎలా అని పలువురు ప్రశ్నిస్తున్నారు. వనం గుడి ప్రాంతంలో ఐదు రహదారులు నిర్మిస్తున్నారు. ఇందులో మూడు మీటర్లు వెడల్పున నాలుగు, 12 మీటర్లు వెడల్పున ఒక రహదారి మొత్తం 435 మీటర్ల పొడుగున నిర్మాణాలు జరుగుతున్నాయి. లక్షలాది రూపాయలు వెచ్చించి నిర్మిస్తున్న రహదారుల పట్ల నాణ్యత ప్రమాణాలు పాటించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.